నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
గురువారం 9 అక్టోబర్ 2025 పేజీలు 8







# పెన్షన్లపై అట్టుడికిన కౌన్సిల్

- వైసీపీ టీడీపీ మధ్య మాటల యుద్ధం
- నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా పెన్షన్లు ఇవ్వలేదన్న అధికారులు
- అధికారులపై టీడీపీ కార్పొరేటర్ల ఆగ్రహం
- సూపర్ సిక్స్ సూపర్ ఫెయిల్ అంటూ వైసీపీ కార్పొరేటర్ల నినాదాలు
- వైసీపీ హయాంలో అరునెలకొకసారి కొత్త పెన్షన్లు ఇచ్చామన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్

విజయవాడ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం అట్టుడికింది. పెన్షన్ల విషయంలో కార్పొరేషన్ లోని కౌన్సిల్ హాల్ లో జరిగిన చర్చ పాలక, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్యుద్ధానికి దారి తీసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన పెన్షన్లు మంజూరు చేయలేదంటూ అధికారులిచ్చిన సమాధానం పట్ల టీడీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై మండిపడ్డ టీడీపీ సభ్యులతో వైసీపీ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో సభ అరుపులు కేకలతో దద్దరిల్లింది. సూపర్ సిక్స్ సూపర్ ఫెయిల్, సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ పాలక, విపక్ష సభ్యులు పరస్పరం చేసిన వ్యాఖ్యలతో సభలో గందరగోళం నెలకొంది. మిగతా 5లో

# పి-4తో అభివృద్ధి పనులు

- పోరంకిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



(కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్)
పి-4 కార్యక్రమంలో భాగస్వాములై అభివృద్ధి పనులు చేపడుతున్న మార్గదర్శిల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెనమలూరు నియోజకవర్గంలోని పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిగతా 2లో...

# జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

వివరాలు 2లో...






## శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో

# అడ్డగోలు దోపిడీ




- భక్తులను నిలువ దోపిడి చేస్తున్న కాంట్రాక్టర్లు
- చోద్యం చూస్తున్న ఆలయ అధికారులు
- ప్రవేశానికే రుసుము
- వసూల్ చేస్తున్న అక్రమదారులు
- అమ్మవారి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా వారి తీరు

పెనుగంచిప్రోలు అక్టోబర్ 8 మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవాలయాలలో శ్రీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం ఒకటి. ఈ దేవాలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు ఆలయానికి వస్తూ ఉండటం 2

(మొదటిపేజీ తరువాయి)



పి-4తో అభివృద్ధి పనులు



దాతల సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, గ్రంథాలయాన్ని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. సమాజాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్న పెనమలూరు మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావును వారు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక స్పృహతో ముందుకు వచ్చి అదనపు తరగతి గదుల నిర్మాణ పూర్తికి ఆర్థిక సహకారం అందించిన దాత అనుమోలు ప్రభాకరరావు కృషి అభినందనీయమని, అందుకు ప్రభుత్వం, విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. దీనితోపాటుగా ఆసుపత్రి నిర్మాణం, 21 పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా పి-4 కార్యక్రమానికి మార్గదర్శిగా నిలిచారని, ఇతరులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని ఉద్బోధించారు. ఏదైనా భిన్నంగా ఆలోచిస్తేనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పారిశ్రామికవేత్తలు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ధీరూభాయ్ అంబానీ, సైకిల్ ప్యూర్ అగరబత్తి వ్యవస్థాపకుడు ఎన్ రంగారావు, శ్వేత విప్లవం పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ తదితర వ్యక్తులు సాధారణ స్థితి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన క్రమాన్ని సోదాహరణగా వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి దాదాపుగా రూ.15 లక్షలను వెచ్చించి నిర్మాణాలను పూర్తి చేసి సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న పెనమలూరు అనుమోలు ప్రభాకర్ రావు అభినందనీయుడని పేర్కొన్నారు. దీనితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలో కళావేదిక ఏర్పాటు చేశారని అభినందించారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు ఏకాగ్రత కలిగి ఉండాలని, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నత స్థానానికి ఎదగాలని అభిలాషించారు. గాలి, నీరు, భూమి కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఇప్పటి నుంచే కృషి చేయాలని విద్యార్థులకు ఆయన ఉద్బోధించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులతో కలిసి భుజించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, పెనమలూరు మండలం తహసిల్దార్ గోపాల కృష్ణ, ఎంపీడీవో ప్రణవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, మండల విద్యాధికారులు కనకమహాలక్ష్మి, శేషగిరిరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అవనిగడ్డ రెవెన్యూ హాలులో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ భారతదేశం ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోందన్నారు. గతంలో మాదిరిగా అమెరికాకు భయపడే పరిస్థితి ఇప్పుడు లేదని, తాజాగా అమెరికా పన్నులు పెంచడంతో, భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్ అవకాశాలను ధైర్యంగా సద్వినియోగం చేసుకుంటోందన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత ఆర్థిక ప్రయోజనాలు దేశ ప్రజలకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టిని తగ్గించి పేద, మధ్య తరగతి వర్గాల, రైతుల కొనుగోలు శక్తి, పొదుపు గణనీయంగా పెంచాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యవసర సరుకుల ధరలు, వ్యవసాయ పనిముట్ల రేట్లు తగ్గాయన్నారు. ఈనెల 16న జీఎస్టీ అవగాహన సదస్సుకు రాష్ట్రానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే మౌళిక సౌకర్యాల కల్పనకు గ్రామాల్లో విస్తృతంగా సీసీ రోడ్ల నిర్మాణం చేసిందన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో పులిగడ్డ - పెనుమూడి బ్రిడ్జి నిర్మాణం టీడీపీ ప్రభుత్వం చేసిందని, ఇప్పుడు ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం కూడా కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయానికి దేశంలో ఏ ఇతర రాష్ట్రాల్లో లేని స్థాయిలో ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే క్షేత్రస్థాయి విస్తృత ప్రచారం జరుగుతుందన్నారు. తద్వారా సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. తగ్గిన జిఎస్టి ప్రకారం తగ్గిన ధరల వివరాల బోర్డులు కచ్చితంగా దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దివిసీమ ఉప్పెన కంటే గత వైసిపి పాలనలో జరిగిన విధ్వంస దుష్పరిణామాలే అధికమన్నారు. కూటమి ఏర్పాటులో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పాత్ర కీలకం అని, అదే క్రమంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ విస్తృత సహకారం అందిస్తుండడంతో, ఎన్నికల ముందు అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిన పెట్టే అవకాశం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో విస్తృతంగా గ్రామీణ సీసీ రోడ్ల నిర్మాణం, జాతీయ రహదారుల అభివృద్ధి, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్న నరేంద్ర మోడీకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని తగ్గించుకొని ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు జీఎస్టీ స్లాబులను మార్చి, పేద, మధ్య తరగతి వర్గాలు, రైతులపై జిఎస్టి పన్నులను గణనీయంగా తగ్గించి మునుపెన్నడూ లేని స్థాయిలో అత్యధిక మేలు చేకూర్చారన్నారు.

దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుతో పేదల విద్యా, ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు. తాజాగా అమలు చేసిన మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16 వేలకు పైగా ఉద్యోగాలు వస్తే, తమ అవనిగడ్డ నియోజకవర్గంలోనే 275 మంది యువకులు ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు అందుకుని ఆయా కుటుంబాలకు అండగా నిలిచే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా తగ్గిన జీఎస్టీ వివరాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ జడ్పీటీసీ కన్నా నాగరాజు, బీజేపీ నియోజకవర్గ నాయకులు జీవీ నగరాయలు, టీవీ గిరి, స్టేట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో అడ్డగోలు దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)




వలన ప్రాంగణం మొత్తం రద్దీగా ఉంటుంది. ఆలయంలో జరిగే ప్రతి కార్యక్రమానికి ఆలయ అధికారులు వేలం పాటల ద్వారా కాంట్రాక్టులు ఇవ్వడం జరుగుతుంది. కానీ కొంతమంది అక్రమార్కులు దేవాలయంలో ప్రవేశించి దేవా లయ అధికారుల కన్నుల్లో అక్రమంగా దేవాలయంలోకి ప్రవేశించే వాహనాలకు ప్రవేశ రుసుమును వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇది ప్రభుత్వ నిబంధనలకు పూర్తి విరుద్ధం. ఆలయంలోని పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వాహ నాలకు మాత్రమే పార్కింగ్ చార్జీలు వసూలు చేసే వెసులు బాటు కలదు. కానీ కాంట్రాక్టర్ అక్రమార్జనకు ఆశపడి అక్రమ మార్గంలో భక్తుల నుండి నిలువు దోపిడీకి తెరలేపారు. ఆలయంలోకి ప్రవేశించే ప్రతి వాహనదారుల నుండి అక్రమంగా 50 రూపాయల నుండి 500 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ఆల యానికి వచ్చిన భక్తులను అక్రమార్కులు నిలువు దోపిడి చేస్తూ ఆలయ ప్రతిష్ట కు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఈ విధంగా ఆలయానికి వచ్చిన భక్తుల నుండే కాకుండా ఆ ప్రాంతానికి వచ్చిన అమాయకుల నుండి కూడా అక్రమ వసూలు చేస్తున్నారు. కనుక ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రవేశ రుసుము వసూలు చేస్తున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అమ్మవారి భక్తులు కోరుతున్నారు.

# శాసన వ్యవస్థ కమిటీలకు అధికారులు జవాబుదారితనం వహించాలి

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఖర్చు చేసే ప్రతి పైసా గురించి ప్రభుత్వ రంగ సంస్థలు శాసన వ్యవస్థకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ప్రభుత్వ రంగ సంస్థల సంఘం చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన పియుసి చైర్మన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పియుసి చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ.... సొసైటీలతో కలిపి రాష్ట్రంలో సుమారు 236 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయని చెప్పారు. వీటికి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలు, వాటి ఖాతాల (అకౌంట్స్) పై కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. శాసన వ్యవస్థ స్టాట్యూటరీ కమిటీలలో ప్రభుత్వ లెక్కల సంఘం (పిఎసి), అంచనాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (పియుసి) ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల సంఘం కాగితాలకే పరిమితమైందని, దీని గురించి సంస్థల ఉన్నతాధికారులకు కూడా అవగాహన ఉండడం లేదని అన్నారు. కొన్ని సంస్థల అధికారులు ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ సిపిడిసిఎల్, ఏపీ ఆయిల్ ఫెడ్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ల నివేదికలను కూలంకషంగా చర్చించారు. ఏపీ సీపీడీసీఎల్ కు ప్రభుత్వం, ప్రజల నుంచి అందాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని ఎందుకు తిరిగి చెల్లించడం లేదని, ఎక్కువ వసూలు చేసి తక్కువ ఎలా తిరిగిస్తారని ప్రశ్నించారు? కమిటీ సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. కరెంటు తీగలు తక్కువ ఎత్తులో ఉండటంవల్ల జి. కొండూరు మండలంలో ఒకరు చనిపోయారని వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. మరో సభ్యుడు అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కొన్ని సందర్భాల్లో మానవ ప్రమాదాలు జరుగుతున్నాయని ఇలాంటివి జరగకుండా చూడాలని చెప్పారు. ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్(ఏపీ ఆయిల్ ఫెడ్)... లాభాల్లో కొనసాగుతుండటంపై ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ అభినందనలు తెలిపింది.




ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ,ప్రభుత్వ రంగ సంస్థల సంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, అయితా బత్తుల ఆనందరావు,వర్ల కుమార్ రాజా, తెనాలి శ్రావణ్ కుమార్, వసంత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగ మునెయ్య, విభాగాధికారి సతీష్, విజయవాడ ఆర్డీవో చైతన్య, డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# భవానీపురంలో హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

## కొడుకు వరస వ్యక్తే అత్యంత కిరాతకంగా హత్య చేశాడు

## ఏడిసీపీ గుణ్ణం రామకృష్ణ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** భవానీపురంలో అదృశ్యమై హత్యకు గురైన వృద్ధురాలి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వరుసకు కుమారుడు అయ్యే వ్యక్తే ఆమెను అతి కిరాతకంగా హత్య చేశాడని ఏడిసీపీ గుణ్ణం రామకృష్ణ వెల్లడించారు. అనుమానితులపై నిఘా వేసి ప్రత్యేక బృందాలతో కేసును చేధించినట్లు తెలిపారు. నిందితుని నుండి హత్యకు ఉపయోగించిన ఆయుధాలతో పాటు హత్యకు గురికాబడిన వృద్ధురాలి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వివరాల్లోకి వెళితే భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మసాని సుబ్బారావు నగర్ లో మురుగు కాలువలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం బయటపడిన విషయం తెలిసిందే. ఈ కేసును సవాల్ తీసుకున్న భవానిపురం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కీలకమైన ఆధారాలతో నిందుతులను అరెస్ట్ చేశారు. భవానిపురం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏడిసీపీ గుణ్ణం రామకృష్ణ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 1 వ తేదీన భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాసవి కల్యాణ మండపానికి వెళ్లిన పొత్తూరి విజయలక్ష్మి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గొల్లపూడి బొమ్మసాని నగర్ లో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులకు సమాచారం అందింది.. ఏసీపీ దుర్గారావు, ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వంకదార హనుమాన్ సుబ్రమణ్యం పల్సర్ బైక్ పై ఆ వృద్ధురాలిని హెచ్ బి కాలనీలోని తన నివాసానికి తీసుకువెళ్లినట్లు గుర్తించారు. హనుమాన్ సుబ్రమణ్యం ఆయన కుమారుడు లక్ష్మీనరసింహస్వామి మాత్రమే ఆ ఇంటి నుండి బయటకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ లో తేలేంది. అనుమానితుల పై నిఘా ఉంచిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో విజయలక్ష్మి దారుణ హత్య ఉదంతం వెలుగుచూసిందని ఎడిసిపి గుణ్ణం రామకృష్ణ వెల్లడించారు. ఆమెకు కుమారుడి వరుసయ్యే సుబ్రహ్మణ్యం ముక్కలుగా అతి కిరాతకంగా హత్య చేసినట్లుగా గుర్తించామని నిందితున్ని అదుపులోకి తీసుకుని హత్య కు ఉపయోగించిన ఆయుధాలతో పాటు హత్యకు గురికాబడిన వృద్ధురాలి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



## ఆలయ అభివృద్ధికి రూ.1,41,044 విరాళాలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధికి గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ 50 వేల రూపాయలు, శాఖమూరి శ్రీనివాసరావు, శివ దంపతులు 10116లు, విజయవాడ వాస్తవ్యులు మొద్దుకూరి ధనలక్ష్మి 10116లు, వినుకొండ వాస్తవ్యులు అల్లా ఆంజనేయులు, అనురూప దంపతులు 10116లు, లంక సాని నరసింహమూర్తి, మీనాక్షి దంపతులు 10116లు, కాకినాడ వాస్తవ్యులు మద్దిపట్ల సుధాకర్ పద్మ దంపతులు 10116లు, గోళ్ళ బ్రహ్మాజీ విజయశ్రీ దంపతులు 10116లు, గద్దె సత్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు 10116లు, చల్లపల్లి వాస్తవ్యులు కావూరి సుబ్బారావు దుర్గ భవాని దంపతులు10116లు, గుంటూరు వాస్తవ్యులు వనం జగ్గయ్య అనసూయ దంపతులు10116లు విరాళాలు మొత్తంను చాపరాల రామారావు కమిటీ పెద్దలు వల్లభనేని వెంకట్రావు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వరప్రసాద్, యలమంచిలి రామకోటేశ్వరావు, వల్లభనేని వెంకట సుబ్బారావు, మురాల నరేష్ లకు అందచేసారు.



## పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాలు

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పెదపారుపూడి మండలం జమిదింటకుర్రు, భూషణగుళ్ళ గ్రామాలలో పోషకాహార మాసోత్సవాలలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పునుకొల్లు శివరామప్రసాద్ అధ్యక్షతన ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం.శివ నాగమణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సర్పంచ్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. సూపర్ వైజర్ లు శివ నాగ మణి, అరుణకుమారి లు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రదర్శించి అందరూ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకొని రక్తహీనతకు గురికాకుండా ఉండాలని వివరించారు. పంచాయతీ కార్యదర్శి నక్కా కృష్ణవేణి, అంగన్ వాడి కార్యకర్త సుశీల, పలువురు తల్లులు పాల్గొన్నారు.

## మందు గుండు సామాగ్రి తయారు చేయువారు నిబంధనలు పాటించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం, పరిసర ప్రాంత ప్రజలకు పోలీసువారి విజ్ఞప్తి, రాబోవు దీపావళి సందర్భంగా దీపావళి ముందు గుండు సామాగ్రిని తయారు చేయువారు, అమ్మేవారు, కలిగి ఉన్నవారు ఈ కింది సూచనలను తూచా తప్పకుండా పాటించాలి. లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రిని కలిగి ఉండడం గానీ, అమ్మడం గాని చేయరాదు. అనుమతి లేకుండా మందు గుండు సామాగ్రిని తయారు చేయరాదు. మందు గుండు సామాగ్రిని భద్రపరిచే ప్రదేశం / గోడౌన్ లకు లైసెన్స్ కలిగి ఉండవలెను. మందు గుండు సామాగ్రిని అనధికారికంగా ఇళ్లల్లో గాని, షాపులలో గాని భద్రపరచరాదు. లైసెన్స్ తీసుకునే ప్రతి వ్యక్తి తమ షాపులో పనిచేసే ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ చేయించవలెను. లైసెన్స్ పొందిన వ్యక్తి, ఆ లైసెన్స్‌లో పొందు పరిచిన సూచనలను తూచా తప్ప కుండా పాటించవలెను. దీపావళి పండుగ ముందు తాత్కాలికంగా మూడు రోజులు లైసెన్స్ పొందు వారు, వారి మందు గుండు సామాగ్రిని లైసెన్స్ కలిగిన గోడౌన్ లలో మాత్రమే భద్రపరచవలెను. ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి అని ఆర్. పేట్ & మచిలీపట్నం రూరల్ సర్కిల్. సి ఐ కే.ఏసుబాబు తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దేవరపల్లి ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవరపల్లి చంద్రశేఖర్ ఐడి కార్డులను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న దాదాపు 40మంది విద్యార్థులకు ఆయన ఐడి కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముళ్ళపూడి అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఇమ్మానియేల్, కె.హరిబాబు, ఎస్. చంద్రకళ, గురువిందపల్లి తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మడి కోటేశ్వరరావు, కాశి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని చంద్రశేఖర్ ను అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రులోని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామానికి చెందిన ఇంటూరి ప్రశాంత్ కుమారుడు ఇంటూరి గౌతమ్ కృష్ణ కు పి-4 పథకం కింద ఎమ్మెల్యే కుమార్ రాజా ఆర్థిక సహాయాన్ని అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న గౌతమ్ కృష్ణకు 3000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి అతనికి అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా వారి కళ్ళల్లో ఆనందం వికసిస్తోంది

## కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో మరో కొత్త పథకానికి స్వీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ సేవలో పథకం ద్వారా, ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు ఇచ్చిన సందర్భంగా కానూరు గ్రామంలో కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆటో యూనియన్లు,ఆటో డ్రైవర్లందరూ కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. గోపు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు వేసిందన్నారు. ఆటో డ్రైవర్ల కళ్ళల్లో ఆనందం తాండవిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమం కోసం 'ఆటో డ్రైవర్ సేవలో.' పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించిందన్నారు. అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి 15 వేల చొప్పున ఇవ్వనున్నారన్నారు. ఈ పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారన్నారు.సొంత ఆటో, క్యాబ్ కలిగి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం రూపొందించిన ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం 436 కోట్లను కేటాయించిందన్నారు. ఈ నిధులను నేరుగా డ్రైవర్ల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి 10 వేల రూపాయలు మాత్రమే ఇచ్చిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం గత పాలకుల కంటే 50 శాతం అదనంగా 15 వేలు ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం ఈ పథకానికి కేవలం 2,61,516 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి 261.51 కోట్లే ఖర్చు పెట్టిందన్నారు. కూటమి సర్కారులో లబ్ధిదారులు సుమారు 30 వేల మంది అదనంగా పెరిగారన్నారు. అలాగే డ్రైవర్లకు 175 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతోందన్నారు. వాస్తవంగా చూస్తే ఆటో డ్రైవర్లకు ఏడాదికి 15 వేలు అనే కార్యక్రమం పార్టీ మేనిఫెస్టోలో చెప్పలేదన్నారు. అయితే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఏ ఒక్క లబ్ధిదారు నష్టపోకూడదని సిఎం స్పష్టం చెప్పడంతో గతంలో కన్నా ఆర్థిక సాయం పెరగడంతో పాటు లబ్ధిదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనదారులకు మేలు కలిగించేలా పనులు చేపట్టిందన్నారు.ఆటో రిపేర్ల ఖర్చు తడిసిమోపెడు అయ్యేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్య నుంచి గట్టెక్కించిందన్నారు. 1,000 కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి సాఫీగా ప్రయాణం సాగేలా చేసిందన్నారు. పాతవాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను కుదించిందన్నారు. నాడు 20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్ ను 3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించిందన్నారు. పంచాయతీ సెక్రటరీ శ్రీహరి, పి.రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకట రమణ, మోపిదేవి కృష్ణ, సేరు నరసింహారావు, జి.విజయ్ కుమార్, అభ్యుదయ ఆటో వర్కర్స్ యూనియన్ కానూరు పెదపట్నం అధ్యక్షులు మరీదు రాఘవరావు ఆటో వర్కర్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పత్రికా ప్రకటన

ఇందుమూలంగా పత్రికా ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం నందిగామ పట్టణం భవనం కోట్ల సందు డోర్ నెంబర్ :15-107 కాపురస్తుడు వెలిశెట్టి సురేష్ కుమార్ నాగలక్ష్మి దంపతుల కుమారుడు వెలిశెట్టి నాగార్జున (తేదీ.13-03-2012) పేరును వెలిశెట్టి నాగ రుద్రాన్ష్‌గా మార్చడం జరిగింది. అనగా నాగార్జున పేరుకు బదులుగా నాగ రుద్రాన్ష్ గా పేరును మార్చటం జరిగింది. దీనిపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేయగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 9154070889, 9063839378.

ఇట్లు
వెలిశెట్టి సురేష్ కుమార్, నందిగామ.



## స్వామిత్వ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**దావులూరు గ్రామంలో స్వామిత్వ సర్వే పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ**

**(కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్)**

ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్వమిత్వ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కంకిపాడు మండలం దావులూరు గ్రామంలో స్వమిత్వ సర్వేను పరిశీలించారు. తొలుత ఆయన గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి స్వమిత్వ సర్వేకు సంబంధించిన రిజిస్టర్లు, మ్యాపులను పరిశీలించారు. అనంతరం ఆయన రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలిసి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గృహాల వద్దకు వెళ్లి చేసిన సర్వేను రికార్డులతో సరిపోలుస్తూ పరిశీలించారు. కొంతమంది గ్రామస్తులతో మాట్లాడి సర్వే చేస్తున్న విధానంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు ముందు సంబంధిత భూ యజమానికి నోటీసుల ద్వారా తప్పనిసరిగా తెలియజేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, సర్వే ఏడి జోషిలా, కంకిపాడు తాసిల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

### అలోషియాస్‌ను అభినందించిన ఉపకులపతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఫెన్సింగ్ క్రీడలో బంగారు పతకం సాధించిన అలోషియాస్‌ను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ అభినందించారు. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఫెన్సింగ్ టోర్నమెంట్ లో విశ్వవిద్యాలయ బిఫార్మసీ విద్యార్థి అలోషియాస్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె రాంజీ అభినందించి విశ్వవిద్యాలయం మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నవంబర్ 6 నుండి అమృతసర్‌లోని గురునానక్ విశ్వవిద్యాలయంలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనబోతున్నట్లు అలోషియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ గోపిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఏ పాపం చేసుకున్నారు ?



**సంక్షేమ పథకాలు అన్ని ఇస్తున్నారు. ?**

**ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు ?**

**కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంప్లాయిస్ కి ఒక్క డీ ఏ కూడా ఇవ్వలేదు....**

**కర్రా సునీల్ కుమార్**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులు ఏ పాపం చేసుకున్నారు సంక్షేమ పథకాలు అన్ని ఇస్తున్నారు. మంచిదే ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు అని సునీల్ కుమార్ అన్నారు. షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కర్రా సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంప్లాయిస్ కి ఒక్క డీ ఏ కూడా ఇవ్వలేదు. మేము కూడా ఈ రాష్ట్ర ప్రజలమే. మేము కూడా ఈ గవర్నమెంట్ లో భాగస్వాములమే మా పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు అని ప్రశ్నించారు. 12వ వేతన సవర్ణ కమిటీని ఇంకా ఏర్పాటు చేయకపోవడానికి గల కారణం. గత పి ఆర్ సి గడువు ముగిసి 26నెలలు అయినా ఐ ఆర్ ప్రకటించక పోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఇక నిర్లక్ష్యం చేయకండి. అక్టోబర్ 10న జరిగే రాష్ట్ర కాబినెట్ సమావేశంలో ఎంప్లాయిస్ సమస్యలు కూడా చర్చించాలని ఉద్యోగుల మనోభావాలను గౌరవించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరుతున్నాం అని అన్నారు.

# తెలుగు భాషకు కీర్తి కిరీటం స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఘన నివాళి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తెలుగు భాషకు కీర్తి కిరీటం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం స్థానిక వంతెన సెంటరులో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా వారి విగ్రహానికి మంత్రి రవీంద్ర పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రగతిలో కృష్ణారావు పాత్ర స్మరించుకున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. తొలుత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ఆధ్వర్యంలో ప్రతి రోజూ జరుగుతున్న శత జయంతి వేడుకల్లో భాగంగా కృష్ణారావు విగ్రహానికి మోపిదేవి మండల టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, పెద్దకళ్లేపల్లి సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ అరజా ఆశాదేవి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, పెద్దకళ్లేపల్లి గ్రామ కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, పెద్దకళ్లేపల్లి కూటమి నాయకులు జీవీ నగరాయలు, అరజా నరసింహారావు, మెరకనపల్లి నరేష్, చోడగం నాని, తోట కృష్ణాంజనేయులు, అరజా కిరణ్ కాంత్, కేతరాజు శ్రీనివాసరావు, నర్రా లక్ష్మణ ప్రసాద్ -సుమతి, గోళ్ళ రాములు, అడపా దుర్గాప్రసాద్, కూరేటి జగన్, గోళ్ళ శ్రీనివాసరావు, గంధం కృష్ణయ్య, అరజా వేణుగోపాల్, ఆకుల వెంకటేశ్వరరావు, నంద్యాల రాంబాబు, గొర్రెపాటి నాగేశ్వరరావు, అరజా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠా మహోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఏడో వార్డులో బుధవారం శ్రీ హనుమత్ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామి, శ్రీ భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల నూతన విగ్రహాలు ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని నూతన ప్రతిష్ఠ మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు, వేద పండితులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు యువనేత మండలి వెంకట్రామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు.

# కొర్రమీను చాపల సాగు రైతుకు అదనపు ఆదాయం



**మొవ్వ మేజర్ న్యూస్ :** కొరమీను చేపల సాగు రైతులకు ఎంతో అదనపు ఆదాయమని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో కోరమేను సాగును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాదులను మెరుగుపరిచే వివిధ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ అనుబంధంగా కోరమీను చేపల సాగుతూ రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కోరమేనుకు మార్కెట్లో అధిక డిమాండు ఉండడంతో తక్కువ పెట్టుబడి తో రైతులు అధిక లాభం పొందవచ్చనారు. ఉదయ్ ఆక్వా కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని అవసరమైన సీడ్ సరఫరాతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకం కింద 4.40 లక్షలు అందించడంతోపాటు 35% సబ్సిడీ రాయితీని అందిస్తున్నామన్నారు. కోరమీను చేపల సాగుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువులను తొవ్వించుకోవచ్చని ఆసక్తి గల రైతులు వెలుగు సంస్థ ఏపిఎం లేదా సీసీలను సంప్రదించాలని కలెక్టర్ బాలాజీ రైతులను కోరారు. డిఆర్డిఏ పిడి హరిహరనాథ్ గ్రామ సర్పంచ్ కే సౌదామణి, ఎంపీపీ కే ఇందిరా, తహసిల్దార్ కే మస్తాన్ ఎంపీడీవో డి సుహాసిని పలువురు అధికారులు రైతులు పాల్గొన్నారు.





# డయేరియాపై కారణాలేంటి?

- ఇప్పటిదాకా కారణాలేంటో ఎందుకు తేల్చలేదు
- డయేరియా కేసులు పెరిగినా అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం
- కౌన్సిల్‌లో డిప్యూటీ మేయర్ అవుతు శైలజ అధికారులను నిలదీత





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో డయేరియా సమస్యపై చర్చ లో డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ అధికారులను నిలదీశా రు. ఇప్పటిదాకా డయేరియా వ్యాప్తికి కారణాలను ఎందుకు ప్రకటించలేదని మండిపడ్డారు. డయేరియా కేసులు పెరిగినా అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారని కౌన్సిల్ లో అధికారులపై మండిపడ్డారు. డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ల ఫోన్లకూ స్పందించని అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. డయేరియా వ్యాప్తికి గల కారణాలు ఇప్పటివరకు వెల్లడించలేదని ఆమె ప్రశ్నించారు. “నీరు కారణమా? లేక వేరే కారణమా? స్పష్టత ఇవ్వకుండా అధికారులు కట్టుకథలు చెబుతున్నారు” అని మండిపడ్డారు. అనంతరం కార్పొరేటర్ సర్వాణి మూర్తి మాట్లాడు తూ, నగరంలో వాటర్ ట్యాంకులు క్లీన్ చేయడం లేదని, పైపుల లీకేజీలు సరిచూడడంలో అధికారు లు విఫలమయ్యారని విమర్శించారు. కృష్ణా నది పక్కనే ఉన్న మన నగరానికి తాగునీరు అందించలేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నీటి కలుషితమే డయేరియా వ్యాప్తికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా పైపుల లీకేజీలపై అధికారుల కఠిన పర్యవేక్షణ అవసరమని కార్పొరేటర్లు కోరారు. నగరంలో పాత పైప్ లైన్లను తొలగించి కొత్త పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులను కౌన్సిల్ సభ్యులు కోరారు. డయేరియా వ్యాప్తికి గల కారణాలు ఇప్పటివరకు వెల్లడించలేదని డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీశైలజా రెడ్డి ఆక్షేపించారు. నీటి కలుషితమే డయేరియా వ్యాప్తికి ప్రధాన కారణమని, డయేరియా పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

## డయేరియాకు మినరల్ వాటర్ ప్లాంట్లే కారణం

**ఇప్పటికే వాటిపై నిఘా పెట్టాం**

**కౌన్సిల్‌లో కార్పొరేటర్లకు వీఎంసీ కమిషనర్ ధ్యాన్ చంద్ వివరణ**

డయేరియా ఘటనకు గల కారణాలను వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ వివరణ ఇచ్చారు. మున్సిపల్ వాటర్ సురక్షితమని వెల్లడించారు. అదేవిధంగా డయేరియాకు స్థానికంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు కారణమని, అటువంటి మినరల్ వాటర్ ప్లాంట్లపై నిఘా పెట్టామని వివరించారు. డయేరియా పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్



# కార్పొరేషన్‌కు చెందిన ఏడు ప్రధాన రోడ్లను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేస్తాం



బుడమేరు ముంపు తో ఏడాది గడిచినా చర్యలు శూన్యం

డయేరియాతో కారణాలేంటో కనగొనడంలో అధికారుల తాత్సారం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కార్పొరేషన్ కు చెందిన ఏడు ప్రధాన రోడ్లను పి పి పి పద్ధతిలో అభివృద్ధి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను నగరపాలక సంస్థ తిరస్కరించిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కౌన్సిల్ సమావేశం అనంతరం రాయన భాగ్యలక్ష్మి తన ఛాంబర్ లో విలేఖరులతో మాట్లాడుతూ.... దివ్యాంగుల పెన్షన్ వెరిఫికేషన్ వల్ల వారు తీవ్ర ఆందోళన చెందుతున్న అంశాన్ని కౌన్సిల్లో చర్చించామన్నారు. బుడమేరు ముంపు వల్ల నగరం మునిగి ఏడాది గడిచిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడాన్ని కౌన్సిల్ ప్రశ్నించింది అన్నారు. అదేవిధంగా వైసీపీ హయాంలో 400 కోట్లతో రెండేళ్లలో కృష్ణా రిటైనింగ్ వాళ్ళు పూర్తి చేసిన అంశాన్ని ఆమె ప్రస్తావించారు. డయేరియా వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికి సరైన కారణాలు కనుగొనడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ సరఫరా చేసే నీరు రంగు మారడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని ఆమె స్పష్టం చేశారు.

## కూటమి ప్రభుత్వం వచ్చాక నగరాభివృద్ధి

**బుడమేరు ముంపు సమస్యపై ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది**

**టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి చురుగ్గా జరుగుతోందని టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి అన్నారు. దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయని విజయవాడ ఉత్సవం కూడా విజయవంతమైందన్నారు. విజయవాడ నగరంలో గతంతో పోలిస్తే రోడ్లు మెరుగయ్యాయని డ్రైనేజీ వ్యవస్థ కూడా సమూలంగా మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బుడమేరు ముంపు సమస్యపై ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. డయేరియా వల్ల కొంత ఇబ్బంది జరిగినప్పటికీ ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని ఆయన పేర్కొన్నారు.

## పెన్షన్ల మంజూరులో కూటమి ప్రభుత్వం మాట తప్పింది

**నిధులు రాబట్టడంలోనూ విఫలం**

**బుడమేరు ముంపు నివారణ చర్యలు తీసుకోవడంలోనూ విఫలం**

**సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయ సత్యబాబు**



నగరపాల సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల నిధులను రాబట్టడంలో విఫలమయ్యారని సిపిఎం కార్పొరేటర్ బోయ సత్యబాబు విమర్శించారు. టిడ్కో ఇళ్లను పేదలకు అప్పగించకుండా కాలయాపన చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. విజయవాడలోని ఏడు ప్రధాన రహదారులను పిపిపి పద్ధతిన అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదన చేయగా కౌన్సిల్లో తిరస్కరించామని వివరించారు. పెన్షన్ల మంజూరులోనూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఈ అంశంపై కూడా చర్చించామన్నారు. బుడమేరు ముంపు నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యా రని ధ్వజమెత్తారు. డయేరియా రాకుండా పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కోరినట్లు తెలిపారు.



## బుడమేరుపై కౌన్సిల్‌లో రసాభాస

**వైసీపీ టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం**

**14 నెలల్లోనే కృష్ణలంక రిటైనింగ్ వాల్ గత ప్రభుత్వం నిర్మించిందన్న వైసీపీ కార్పొరేటర్లు**

**కూటమి ప్రభుత్వం బుడమేరు వరద నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మించలేకపోయిందంటూ వైసీపీ ఎద్దేవా**

**వరద నివారణకు రిటైనింగ్ వాల్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్న టీడీపీ**

**విజయవాడ పరిధిలో ఎక్కడ జరిగిందో చెప్పాలన్న వైసీపీ**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బుడమేరు అంశం పై నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో వైసీపీ–టీడీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. 14 నెలలో వైసీపీ ప్రభుత్వం కృష్ణలంక రిటైనింగ్ వాల్ నిర్మించిందని కానీ కూటమి ప్రభుత్వం బుడమేరు వరద నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయలేకపోయిందని వైసీపీ సభ్యులు తీవ్ర విమర్శలు చేసారు. దీంతో టీడీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుడమేరు ప్రళయనికి సంవత్సరం పూర్తయిన ఇప్పటివరకు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టలేదని ప్రభుత్వాన్ని వైసీపీ నేతలు ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీ వర్షాకాలం ముగిసిన తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పగా టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే వరద నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని టీడీపీ సభ్యులు వెల్లడించారు. విజయవాడ పరిధిలో ఎక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణం జరగడం లేదని మేయర్ చెప్పారు. అదేవిధంగా తన షాప్ బుడమేరు వరద ముంపులో మునిగిందని నష్టపరిహారం అందలేదని కార్పొరేటర్ రామిరెడ్డి చెప్పగా టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం అందిందని అసత్యాలు చెప్పొద్దని హితవు పలికారు. తన వద్ద ఆధారాలు ఉన్నాయని రామిరెడ్డి చెప్పారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు కూడా వైసీపీకి మద్దతుగా మాట్లాడగా టీడీపీ కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్ సత్యబాబు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దింతో సభలో గందరగోళం జరిగింది. వైసీపీ కార్పొరేటర్ బండి పుణ్యశీల కలగచేసుకొని టీడీపీ కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యలను రికార్డ్స్ తొలగించాలని మేయర్ ను కోరారు.

## పెన్షన్ల పై అట్టుడికిన వీఎంసీ కౌన్సిల్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నూతన పెన్షన్ల అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సూపర్ సిక్స్ – సూపర్ ఫెయిల్” అంటూ వైసీపీ సభ్యులు నినాదాలు చేయగా, టీడీపీ సభ్యులు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నినాదాలు సీజేశారు. వైసీపీ–టీడీపీ సభ్యుల నినాదాలతో కౌన్సిల్ ఒక దశలో అట్టుడికిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని వైసీపీ సభ్యులు విమర్శలు గుప్పించారు. ప్రశ్నోత్తరాల సమయంలో19వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ రెహానా నహీద్ 2024 జూలై నుండి ఎన్ని పెన్షన్లు మంజూరు చేశారోచెప్పాలని ప్రశ్నించారు. దీనికి అధికారులు స్పందిస్తూ, నూతన పెన్షన్లు ఇవ్వలేదని, అయితే సెప్టెంబర్ నెలలో 161 స్పౌస్ పెన్షన్లు మాత్రం మంజూరు చేసినట్లు ఇచ్చిన సమాధానం కౌన్సిల్లో దుమారానికి తెరలేపింది. అధికారుల సమాధానంపై టీడీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని, ఇప్పుడు 15 నెలలుగా ఎన్ని పెన్షన్లు ఇచ్చారో చెప్పాలంటూ వైసీపీ సభ్యులు సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలతో కౌన్సిల్లో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. కుల మత రాజకీయాలకు అతీతంగా పెన్షన్లు మంజూరు చేసిన ఘనత జగన్ దేనని మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని ఎద్దేవాచేశారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ, ఆర్థిక సహాయం



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ శివారు పులవర్తివానిగూడెంలో పలు కుటుంబాలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు. గ్రామానికి చెందిన దిరిశిన భుజంగరావు ఇటీవల మరణించగా ఆయన గృహానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి పి-4 పథకం ద్వారా ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గుమ్మడి బాబురావు గృహంనకు వెళ్ళి ఇటీవల ఆయన మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. వీరికి కూడా పి-4 పథకం ద్వారా రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే అదే గ్రామంలో చోరగుడి కుమార్ బాబు అనారోగ్య కారణంతో విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే ఆయనను కూడా పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుమార్ బాబు కు పి-4 పథకం ద్వారా ఐదు వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని కుమార్ రాజా అందజేశారు. గ్రామానికి చెందిన రాచూరి ప్రభుదాస్ పి-4 పథకం ద్వారా ఈ కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించారు. సేవా భావంతో ఆర్థిక సహకారం అందించిన ప్రభుదాసును ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, వెంట్రప్రగడ పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బారావు లతో పాటు పలువురు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నిర్మూలన

**ఏ కొండూరు, మేజర్ న్యూస్:** ఏ.కొండూరు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాలలో ఈనెల 9న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి షేక్.టిప్పుసుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్.యస్.కె. సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎలుకల మందు బ్రోమోడయోలిన్ ఎర తయారీ చూపించి ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రైతులందరూ పాల్గొని బ్రోమోడయోలిన్ ఎరను తీసుకుని వెళ్ళగలరు, కార్యక్రమంను విజయవంతం చేయాలని రైతులను కోరారు.

## పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** విజయవాడలో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో జరిగిన ఈ సమావేశంలో పి.యు.సి సభ్యులైన మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ రాష్ట్రంలో 52 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయన్నారు. ఇందులో ఏపీఈపీడీసీఎల్, జెన్కో, మార్క్ఫెడ్, ఎస్పీడీసీఎల్, సీడ్ కార్పొరేషన్, ఆగ్రోస్ వంటివాటి గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులు, నియామకాలు, ఆడిట్ అభ్యంతరాలు, తీసుకున్న చర్యలు, నిధులు వినియోగం, వంటి వాటిపై పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సహచర పి.యు.సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ పై విద్యార్థులకు అవగాహన చాలా ముఖ్యం



**పెడన: మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడమే కాకుండా వన్ నేషన్..ఒన జీఎస్టీ అనే నినాదంతో ముందుకు అడుగులు వేస్తోందని, తద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కేసీఎస్వీఎస్ రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీ బొడ్డు నాగయ్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె శేషుకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల మార్కెట్లో కొనుగోళ్లు పెరుగుతాయన్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపారు. ఈ విషయాలను విద్యార్థులు గమనించి జీఎస్టీ తగ్గింపు వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయనేది అవగాహన చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నిరంజనరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఫీల్డ్ విజిట్కు తీసుకువెళ్లి మార్కెట్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించి తెలుసుకున్నారు.

# ముగిసిన ఉరుసు మహోత్సవాలు





**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** సేవను ఆరాధనగా, మానవతను మతంగా భావించే సూఫీ సిద్ధాంతాల మార్గంలో నడుస్తూ, అతా మొహమ్మద్ నిజాముద్దీన్ షా నిజామిషా తాజ్ ఖాదరి బాబా, జంపని ( ఏ ఏ బి ఎస్ టి ఏ) తమ జీవితాన్నే దైవ సేవకు అంకితం చేసుకున్నారు. "ఈ రోజు లంగర్ ఉండదు" అనే మాట తన దర్బార్ లో ఎప్పుడూ వినిపించదు. ప్రతీ రోజూ భక్తులకు ఆహారం, ఆశీర్వాదం, ప్రేమతో కూడిన సాత్విక సేవ, ఆప్యాయతతో పలకరించి ప్రేమతో కడుపునిండా భోజనం పెట్టి ఇవన్నీ ఆయన జీవిత విధానంలో భాగంగా మారిపోయాయి. చీమలపాడులో వేంచేసి ఉన్న ఆధ్యాత్మిక మార్గదర్శి సద్గురువు,హజ్రత్ మొహమ్మద్ అతాఉల్లా షరీఫ్ షాహ్ తాజ్ ఖాదరి బొగ్దాది బాబా వారి దివ్య ఆశీస్సులతో ఇంతటి ఘనమైన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. అతా మొహమ్మద్ నిజాముద్దీన్ షా నిజామి నిజం బాబా యొక్క గురువు హజ్రత్ మొహమ్మద్ అతాఉల్లా షరీఫ్ షా హ్ తాజ్ ఖాదరి బొగ్దాది బాబా వారు భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకులు మాత్రమే కాదు, సేవలో అపారమైన తపస్సు కలిగిన మహానుభావులు. వారి ఆశీర్వాదమే నిజాముద్దీన్ షా నిజామి బాబా జీవితానికి మార్గదర్శక దీపం అయింది.

**4వ ఉరుసు మహోత్సవం వైభవం**

ప్రతీ సంవత్సరం అత్యంత ఘనతతో జరుపుకునే హజ్రత్ అతాఉల్లా షరీఫ్ షాహ్ తాజ్ ఖాదరి బొగ్దాది బాబా వారి ఉరుసు మహోత్సవం, అక్టోబర్ 4, 5, 6 తేదీలలో జంపని గ్రామంలోని ఏఏబిఎస్టిఏ దర్బార్లో అద్భుతమైన శ్రద్ధా భక్తులతో నిర్వహించారు. ఈ పుణ్య సందర్భంలో జంపని, ఉత్సవాల ప్రారంభం నుంచి ప్రతీ క్షణం భక్తి, సంగీతం, సేవ,, సూఫీ ప్రేమ తో నిండిపోయింది. జంపని దర్బార్లో తన గురువు ఉరుసు మహోత్సవం సందర్భంగా వారంరోజుల నుండి నిరంతర అన్నదానం, ఆధ్యాత్మికోత్సవాలు ఉరుసు మహోత్సవానికి ముందు వారం రోజులుగా నిజాం బాబా జంపని వారి ఆశ్రమంలో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు భోజనం, ప్రార్థన, ఫాతేహా, ఖురాన్ పఠనం, ఖవ్వాలీలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ సత్యసేవా వాతావరణాన్ని అనుభ విస్తున్నారు. వారంరోజులుగా కొనసాగిన ఈ సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక తేజస్సు, మానవతా స్ఫూర్తి,, సూఫీ సంప్రదాయాల గౌరవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**భక్తి ఘనతతో ఆధ్యాత్మిక ఊరేగింపు**

6న నిజాం బాబా వారి ఆధ్వర్యంలో జంపని దర్బార్ నుండి ప్రారంభమయ్యే ఆధ్యాత్మిక ఊరేగింపు అత్యంత వైభవంగా9న ముగి సింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా కలియర్ షరీఫ్ సాబిర్ పాక్ మహనీయుల సజ్జాదే నషిన్ హజ్రత్ అలీ మంజర్ ఐజాజ్ ఖుద్దుసి సాబ్రీ మహనీయులు విచ్చేశారు. మేళతాళాలు, డీజే బృందాలు, ఖవ్వాలీల గానాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ, అతాఉల్లా షరీఫ్ షాహ్ తాజ్ ఖాదరి బొగ్దాది బాబా వారి పవిత్ర చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీపై తీసుకెళ్లి భక్తుల నినాదాల మధ్య చీమలపాడు వైపు శోభాయమానంగా ఊరేగింపుగా వెళ్లారు.

సందల్, చాదర్, పూల హారాలతో మహానివేదనం చీమలపాడు చేరుకున్నరు. అక్కడ బాబా దివ్య సమాధి వద్ద సమిష్టిగా సందల్, చాదర్, గులాబీ పూల హారాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. దీనికి అనుసంధానంగా గొప్ప అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించారు. ఇందులో వేలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

**మానవతా దృక్పథానికి ప్రతీక జంపని బాబా**

హజ్రత్ అతా మొహమ్మద్ నిజాముద్దీన్ షా నిజామి బాబా సేవా దృక్పథం ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తోంది. తన గురువు బాటలో నడుస్తూ, సూఫీ తత్త్వాల సారాన్ని ప్రజల్లో వ్యాప్తి చేస్తూ "సేవే ఆరాధన – మానవతే మతం" అనే అద్భుతమైన సూఫీ సందేశాన్ని ప్రజల మనసుల్లో ప్రతిష్ఠించారు. అయన దర్బార్ లో జాతి, మతం, కులం అనే భేదాలు లేవు. ప్రతి ఒక్కరికీ ప్రేమతో, గౌరవంతో ఆహ్వానం లభిస్తుంది. ఈ సేవా భావమే ఆయనను నిజమైన సూఫీ వారసత్వంగా నిలబెట్టింది.

**సూఫీ ప్రేమకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక**

ఈ 4వ ఉరుసు మహోత్సవం కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదు ఇది సూఫీ ప్రేమ, మానవతా సమానత్వం, దైవభక్తి,, సేవాస్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోంది. భక్తుల హృదయాలలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలిస్తూ, హజ్రత్ అతాఉల్లా షరీఫ్ షాహ్ తాజ్ ఖాదరి బొగ్దాది బాబా, ఆయన శిష్యుడు హజ్రత్ అతా మొహమ్మద్ నిజాముద్దీన్ షా నిజామి బాబా దైవసేవ, మానవతా ప్రేమ సదా నిలిచిపోనుంది. ఘనంగా ప్రారంభమైన ఉరుసు మహోత్సవానికి భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల వసతులు కల్పించారు.

# పట్టణ అభివృద్ధి అంటే బొడ్డు



### బొడ్డు అంటే అభివృద్ధి టీడీపీ నాయకుల వెల్లడి

**పెడన, మేజర్ న్యూస్ :** కలంకారీ క్లస్టర్ సమావేశాన్ని నిర్వహిస్తే కూటమి నాయకులకు ఎక్కడ పేరు ప్రఖ్యాతలు వస్తయో అని అక్కసుతో వైసీపీ కౌన్సిల్ సభ్యులు కౌన్సిల్ సమావేశంలో వ్యతిరేకించారని, పట్టణ అభివృద్ధి జరిగిందంటే అది బొడ్డు వేణుగోపాలరావు హయాంలోనే జరిగిందని చెబుతూ వారి హయాంలో నిర్మించిన భవనాల శిలాఫలకాలు చూసుకుంటే వైసీపీ కౌన్సిలర్లకు అర్థమవుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎక్కల శ్యామలరావు అన్నారు. ఈ మేరకు తోట మూల లో గల టీడీపీ కార్యాలయంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎర్ర రాజా మాట్లాడుతూ ఎం ఎస్ ఎం ఈ కి ఇవ్వటానికి వీళ్ళు ఎవరని ఒక కౌన్సిలర్,అది వేరే వాళ్ళకి ఇచ్చేసాము అని మరొక కౌన్సిలర్ ఇలా అవగాహన లేకుండా ఎవరు ఇష్టం వచ్చినట్టు వాళ్లు మాట్లాడుతున్నారని చెబుతూ దీపం పథకం రాష్ట్రంలో లక్షల మందికి వచ్చిందని ఈ మాత్రం కూడా కౌన్సిలర్లకు తెలియదా అని ప్రశ్నించారు. పట్టణ అభివృద్ధి ఒక బొడ్డు వేణు హయాంలో మాత్రమే జరిగిందని చెప్పారు. వేణుగోపాలరావు విమర్శించే స్థాయి వైసీపీ కౌన్సిలర్ కు లేదని తెలిపారు. ఎర్ర శేషగిరి రావు తనను ఇబ్బంది పెట్టారని వైసీపీ కౌన్సిలర్ వద్ద వాపోయారని కౌన్సిల్ సభ్యులు చెప్పటం అది అసత్యం అని దానికి సాక్షిని నేనేనని రాజా పేర్కొన్నారు. అధికారం ఉన్న లేకున్నా ఒక కమ్యూనిటీని, పరిశ్రమను పట్టణ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ధ్యేయంతోనే వేణు పనిచేస్తుంటే విమర్శలు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగిత కృష్ణ ప్రసాద్ కి పెడన 23 వార్డుల నుంచి 7000 ఓట్లు మెజారిటీ వచ్చిందని రేపు రాబోయే కౌన్సిల్ తమదేనని దానికి నిదర్శనం ఇదేనని స్పష్టం చేశారు. కలంకారీ క్లస్టర్ వస్తే కలంకారి పరిశ్రమకు సంబంధించిన రా మెటీరియల్ తక్కువ ధరకు వస్తాయని దానిని వెతిరేకించటం హేమమైన చేర్య అన్నారు. అనంతరం కొంతమంది టీడీపీ నాయకులు వైసీపీ సభ్యులు పై విమర్శలు గుప్పించారు. స్మశాన వాటికలో ఒక రాయిని కూడా వేయనేమో అన్న కటకం ప్రసాద్కు సవాల్ విసురుతున్నామని ఇప్పుడు ఉన్నవి పసుపు రంగులో ఉన్న రాళ్లు ఉన్నాయని దమ్ముంటే అక్కడికి రావాలి అని తాను ఒక్కడినే వస్తానని కమ్మగంటి హెచ్చరించాడు. జితేంద్ర మాట్లాడుతూ జోగి హయాంలో పట్టణంలో రౌడీయిజం నడిచిందని తనపై ఎన్నో రకాల వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ తమ నాయకుడు జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని రాబోయే ఎన్నికలలో వైసీపీ కౌన్సిలర్లు తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చందన నారాయణరావు, కమ్మగంటి బాబు హన్ను వాహబ్ఖాన్,తమ్మ భీమయ్య, పరసా జితేంద్ర, జలీల్ భాష,వెలికట్ల ప్రసాద్,సేనాపతి అజయ్, కుర్మాశివానంద్, మెడక కిషోర్, బొడ్డు తాతయ్య, దాదా,తదితరులు ఉన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడలోని ప్రభుత్వ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరటం జరిగిందని ప్రభుత్వ డెంటల్ కాలేజ్, హాస్పిటల్ ప్రిన్సిపల్ డా.కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా ఎం పిక కమిటీ ద్వారాభర్తీ చేయబో యే పోస్టులు క్రింది విధంగా ఉన్నాయని, వీటిలో డెంటల్ హైజి నిస్ట్ ఒకటి, డెంటల్ టెక్నీషియన్ ఒకటి, డెంటల్ మెకానిక్ ఒక పోస్టనకు దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని అన్నారు. ఈ నెల 7వ తేదీ నుండి వెబ్ సైట్అం దుబాటులో ఉంచి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని, ఈ నెల 13వ తేదీ దరఖాస్తుల స్వీకరణ తుది గడువని, అభ్యంతరాల అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్ష తన ఎంపిక కమిటీ ఈ నెల 27న తుది ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించటం జరుగుతుం దన్నారు. ఇతర వివరాలు, అర్హతలకు సంబంధించి https://gdchvja.in వెబ్సైట్లో అందుబాటులో ఉంచటం జరిగిందని ప్రభుత్వ డెంటల్ కాలేజ్, హాస్పిటల్ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో తెలిపారు.

# నగరంలో నిరంతరం డీసిల్టింగ్ పనులు జరుగుతుండాలి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** డిసిల్టింగ్ ప్రక్రియ నిరంతరంగా జరుగుతుండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యాటన లో భాగంగా ఏలూరు రోడ్డు, గుణదల సెంటర్, పులేటి కట్ట రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు, గురునానక్ కాలనీ, వాసవి నగర్, న్యూ పిఎన్టి కాలనీ, పటమట ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెట్ల వ్యర్థాలను, చెత్తకుప్పలను, ఎప్పటికప్పుడు తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేస్తుండాలని, సైడ్ కాలువలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పటమట లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

# నిత్యవసర సరుకులు పంపిణీ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బేతేల్ సంఘం వారి ఆధ్వర్యంలో కొత్తపేట గ్రామానికి చెందిన 100మంది నిరుపేద కుటుంబాలకు పాస్టర్ పాల్ మేయర్, జార్జ్ ముల్లర్ ల పర్యవేక్షణలో నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది, బుధవారం పంచాయతీ శివారు కొత్తపేట గ్రామంలో కృష్ణానది వరదల కారణంగా పనులు లేక ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు హైదరాబాద్ కు చెందిన విశ్వ ప్రగామి ట్రస్ట్ సమకూర్చిన నిత్యావసర సరుకుల ను వందమంది నిరుపేదలకు అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పాల్ మేయర్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు సూచించిన మార్గంలో ఆపదలో ఉన్నవారికి చేయూతను అందించడం జరిగిందని, దేవుని కృపను బట్టి సర్వజనుల శ్రేయస్సు కోసం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చి పేదలను




ఆదుకుంటున్న విశ్వ ప్రగామి ట్రస్ట్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,విశ్వ ప్రగామి ట్రస్ట్, మిస్టర్ మోజస్ బెన్ టిక్,మెదటి ఎరియా సౌత్ జోన్ మేనేజర్, జి స్టీఫేన్, ఎపి స్టేట్ కో ఆర్టినేటర్, జి సురేష్, అసిస్టెంట్ కోడినేటర్, పరంజ్యోతి, వై మధు. తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 మంది వ్యక్తులకు జరిమానా

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహన ములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపధ్యంలో బుధవారం 2వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 10 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 10మందిలో ఒక్కరికి రూ.15,000ల మిగిలిన 09 మందికి ఒక్కొక్కరికిరూ.10,000ల చొప్పున రూ.90,000ల మొత్తం 10 మందికి రూ.1,05,000ల జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేశారు.

## కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



**ఔషధ దుకాణాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలోని ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ హెచ్చరించారు కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. అనుభవం లేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ దుకాణంలోనైనా ఫార్మసిస్టులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తప్పన్నారు. తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ఫార్మసిస్టులు ఔషధాలు అందించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని.. ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె. అనిల్ కుమార్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు హాజరయ్యారు

# వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**విజయవాడ, మేజర్ న్యూస్ :** విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని అధికారులకు సూచన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాయకాపురంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీరు అందిస్తున్న వ్యవస్థను పరిశీలించారు. తాగేందుకు మినరల్ వాటర్ అందిస్తున్నామని వసతి గృహ అధికారులు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ ఆవరణలోని కిచెన్ గార్డెన్ పరిశీలించి.. గార్డెన్ అభివృద్ధికి అవకాశం ఉన్నందున ఆ దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తగా చూడాలని ఆదేశించారు. ఈ మధ్య ఎవరైనా విష జ్వరాలు లేదా డయేరియా బారిన పడ్డారా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లతోపాటు మిగిలిన అన్ని వసతులు సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని.. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట వసతి గృహ సంక్షేమ అధికారులు కె.సరోజ గ్రేస్, పి. సుజాత ఉన్నారు.

## మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమాలు



**నాగాయలంక అక్టోబర్ 8 మేజర్ న్యూస్ :** దివి సీమ గాంధీ మండలి. వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమాలు నాగాయలంక గ్రామంలో 66వ రోజు చేరుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ మండల వెంకట కృష్ణా రావు విగ్రహానికి, యు. ఎం. ఆర్ ఫెర్టిలైజర్స్ లేజర్స్ అధినేత ఉప్పల భూపాల్ పూలమాలవేసి నివాళి అర్పించినారు. ఈ కార్యక్రమానికి భావదేవరపల్లి సర్పంచ్ మండలి.ఉదయభాస్కర్ టీ.కొత్తపాలెం మాజీ సర్పంచ్ మెండు.లక్ష్మణరావు బరంకుల పిఎసిఎస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు డి.సి చైర్మన్ బండ్రెడ్డి వెంకట నాగ మల్లికార్జున్(చిన్న బాబు) భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక.శివాజీ మర్రిపాలెం మాజీ సర్పంచ్ బండ్రెడ్డి బోసు సిరివెళ్ల నాగరాజు గుడివాక శివరావు రిటైర్డ్ ఎంఈఓ తలశిల.రామకృష్ణ ఏఎంసీ సభ్యులు ఉప్పల ప్రసాద్ మాదివాడ అర్జున్ రావు తాడేపల్లి పాపారావు వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యాం ప్రసాద్ భోగాది సతీష్ రేమాల బాబురావు భోగిరెడ్డి బుజ్జి భోగాధి. అనురాధ తోట.మానస చందన.సుబ్బారావు సజ్జ.శంకర్.పితా వెంకటేశ్వరరావు మండలి వెంకట కృష్ణా రావు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## ఎన్టీఆర్ జిల్లాలో ప్రకృతి వ్యవసాయ బృందం పర్యటన



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలోని జి. కొండూరు, మైలవరం, తిరువూరు మండలాలలోని పలుచోట్ల సాగుతున్న పంట భూ ములను ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై శంకర్ నాయక్, సిబ్బంది బృందా కృష్ణన్ ల లు కలసి పరిశీలించారు. స్వాగతం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ అమల తీరు పురోగతి గురించి వారు క్లుప్తంగా వివరించారు. కాటన్ ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్, వరి లైన్స్, రైజ్డ్ బెడ్స్ బయో ఇన్పుట్ ల తయారీ ఘన ద్రవ జీవామృతం వారి, ద్రవ జీవామృతం పొలంలో పారించి చూపించడం జరిగింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ఉపయోగాలు గురించి వివరించడం జరిగింది. జి కృష్ణన్ పీహెచ్డీ స్కాలర్ న్యూఢిల్లీ నుంచి ఇక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పరిశీలిం చి వాటిని ఇంకా అమల్లోకి తీసుకొని రావాలని తెలిపారు. తిరువూరు మండలం రామన్నపాలెం గ్రామంలో రైతులతో పరస్పర చర్చ చేయడం జరిగింది బృందా జి కృష్ణన్ రైతులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు రైతులు ప్రకృతి వ్యవసాయం వల్ల తమ ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగినట్లు వివరించారు రైతులు వాళ్ళ అనుభవాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై శంకర్ నాయక్, సౌమ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే మండలి పిలుపు**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఈ నెల 15వ తేదీ అవనిగడ్డలో జరిగే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జాబ్ మేళా వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం క్రమం తప్పకుండా జాబ్ మేళా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. యువత పెద్దసంఖ్యలో తరలివస్తూ ఈ జాబ్ మేళాల ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారన్నారు. స్థానిక ఎస్వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాకు అవనిగడ్డ నియోజకవర్గంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చి ఉద్యోగ అవకాశాలు అందుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్, జాయ్ అలుకాస్ జ్యువెలర్స్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్ పామోలివ్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీనివాస ట్రాక్టర్స్ ఎస్మార్ట్ పవర్ ట్రాక్, మోహన్ స్పిన్ టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం సంస్థలలో ఉద్యోగ అవకాశాలు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువ నాయకుడు మండలి వెంకట్రామ్, నైపుణ్య అభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ జీ.పృథ్వీజ, రాచూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం

## రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం రహదారులపై పశువులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన గోశాలను సందర్శించి, విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువులను నియంత్రించేందుకు గత ఆగస్టు నెలలో పశువుల శాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 326 పశువులను పశువులశాలలో ఉంచగా, వాటిలో 269 పశువులను యజమానులు రుసుము చెల్లించి తిరిగి తీసుకెళ్లారని వివరించారు. అయితే, 16 పశువులు తీవ్ర అనారోగ్యంతో చనిపోయినట్లు మంత్రి తెలిపారు. వాటికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో కడుపులో కుళ్లిపోయిన ప్లాస్టిక్ కవర్లు, జీర్ణం కాని ఆహారం ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పశువుల శాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పశువుల హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారని, ఇందుకోసం భూముల కేటాయింపు, నిధుల విడుదల త్వరలోనే జరుగుతాయని వివరించారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను సేకరించి గోశాలలో ఉంచే చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్ స్థానిక నాయకులు లోగిశెట్టి స్వామి, కోస్తా మురళి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో పారదర్శకతకు ముఖ ఆధారిత హాజరు

## త్వరితగతిన శ్రామికుల ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేయండి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 08, మేజర్ న్యూస్:** ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచేందుకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసేందుకు వేతనదారుల ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆధార్ డేటా, ఈ-కేవైసీతో ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు పథకం అమల్లో పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సంబంధించిన ఫేస్ – ఆర్‌డీ అండ్ ఎన్ఎంఎంఎస్ యాప్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించేందుకు అవసరమైన ప్రణాళికపై దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చూస్తే సగటు వేతనం విషయంలో గంపలగూడెం, కంచికచెర్ల, జగ్గయ్యపేట మండలాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయని.. ప్రతి మండలం ఈ విషయంలో ప్రగతి చూపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 2025-26లో 4 వేల ఎకరాల ఉద్యానపంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 3,745 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా మునగ సాగుకు 880 ఎకరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది వివరించాలన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐ) పురోగతిపైనా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లపైనా చర్చించి, కలెక్టర్ లక్ష్మీశ సూచనలు చేశారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లాలో ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెనమలూరు మండలం పోరంకిలోని మూడవ సచివాలయం నుండి వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో ధాన్యం సేకరణకు చేపట్టవలసిన పటిష్ట చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ సజావుగా చేపట్టే విధంగా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. సాగు విస్తీర్ణం ఆధారంగా అవసరమైన గోనె సంచుల సిద్ధం, రవాణా వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలు నుంచి మిల్లులకు చేరే ధాన్యంలో తేమ శాతంలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని, రెండు చోట్ల ఒకే కంపెనీకి చెందిన తేమ శాతం కొలిచే యంత్రాలు ఉండాలని సూచించారు. తేమ శాతాన్ని నిర్ధారించడంలో సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించే విధంగా చూడాలన్నారు. ఆ గ్రామంలో రోజుకు ఎంత మొత్తంలో ధాన్యం రావచ్చనే విషయంపై గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కలిగి ఉండాలని,కోత కోసే విషయాన్ని రైతు సేవా కేంద్రంలో ముందుగా తెలియపరిచే విధంగా రైతులకు గ్రామ సభల ద్వారా అవగాహన పరచాలని, తద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలిం చడంలో ఏర్పడే గందరగోళాన్ని నిరోధించవచ్చన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారానే మిల్లుకు ధాన్యం వెళితే ట్రక్ షీట్ ఉత్పత్తి (జనరేట్) అవుతుందని, లేదంటే మిల్లర్లు ధాన్యం అన్లోడ్ చేసుకోక రైతు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఈ విషయాన్ని రైతుకు అర్థమయ్యే విధంగా వివరించి చెప్పాలన్నారు. మంచు ఆరక ముందే ఉదయం వేళ, అదేవిధంగా రాత్రి సమయాల్లో వరి కోత యంత్రాలతో కోయకుండా చూడడం ద్వారా తేమ శాతాన్ని తగ్గించవచ్చని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ సామర్థ్యం కలిగిన మిల్లులకు తక్కువ ధాన్యం పంపాలని, అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఇతర మిల్లులకు ధాన్యం పంపేందుకు గానూ అవసరమైతే ముందస్తుగా మిల్లులను ఆన్లైన్లో అనుసంధానం చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు ఈ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్‌లను ఆకస్మిక తనిఖీ

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డితో కలిసి బుధవారం బందర్ రోడ్డులోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కంట్రోల్ రూంను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును గమనించారు, వచ్చిన కాల్స్ లను రిసీవ్ చేసుకుని అధికారులకు తెలియజేయాలని, అనంతరం కాల్ కు వెళ్లిన వారి వద్ద నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, ఎప్పుడూ అప్రంత్తంగా విధులు నిర్వహించాలని తగు సూచనలు చేశారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించి, అస్త్రం యాప్ ద్వారా నగరంలోని ట్రాఫిక్ రద్దీపై రివ్యూ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిరంతరం సి.సి.కెమెరాలను పర్యవేక్షించాలని, ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే అధికారులకు సదరు విషయం తెలియజేయాలని, కేసులను పరిష్కరణలో భాగంగా పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన వారికి పూర్తిగా సహకరించి వారికి అవసరమైన సి.సి. ఫుటేజ్‌లను అందించి కేసులు త్వరగా కొలిక్కి వచ్చేవిధంగా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీతోపాటు డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డి, ఏ.సి.పి. బాను ప్రకాష్ రెడ్డి, ఎస్.బి. ఇన్స్పెక్టర్ డి.వి.రమణ, కంట్రోల్ రూం ఇన్స్పెక్టర్ కనకరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపునీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం మహాత్మా గాంధీ రోడ్డు పర్యటించి క్షేత్రస్థాయిలో వర్షపునీటి నిల్వలను తొలగించే చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం అరగంటలో 30 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని, మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ వర్షపు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారని, అధికారులు వాటిని పర్యవేక్షిస్తున్నారని అన్నారు.




విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999